# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 13.05.2025 | 24 క్యారెట్లు 89,787.00 | కిలో వెండి 1,07,658.00 | 35 °C | సంపుటి:3 | సంచిక:192

www.vishalabharati.com




# పాక్ ఎయిర్ బేస్‌ల ధ్వంసం..

- భారత్ సైన్యం దాడులు నిర్వహించింది.
- పాకిస్థాన్ ఆర్మీపైన కాదని వాటి విడియోలు విడుదల

విశాలభారతి, స్టేట్ బ్యూరో:


పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ సైన్యం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పాకిస్థాన్‌లోని పలు ఎయిర్ బేస్‌లు పూర్తిగా ధ్వంసమైనాయి. అందుకు సంబంధించిన వీడియోలను భారత్ విడుదల చేసింది. సోమవారం న్యూఢిల్లీలో ఎయిర్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్ ఎయిర్ మార్షల్ ఏకే భార్తీ విలేకర్ల సమావేశంలో ఈ వీడియోలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ పోరాటం ఉగ్రవాదంపైన మాత్రమేనని స్పష్టం చేశారు. అంతేకాని.. పాకిస్థాన్ ఆర్మీపైన కాదని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్.. ఉగ్రవాదానికి ఊతం ఇస్తుందని విమర్శించారు. పాకిస్థాన్ రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్ బేస్ పూర్తిగా ధ్వంసమైన వీడియోను విడుదల చేశారు. పాక్ మిలటరీ హెడ్ క్వార్టర్ ఇస్లామాబాద్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఈ ఎయిర్ బేస్ ఉండడం

..మిగతా 2 లో

# సింధూర్ విజయం ఈ దేశ మహిళలకు అంకితం

- టెర్రరిస్టు స్థావరాలు నేలమట్టం
- పాకిస్తాన్ డ్రోన్లను కుప్పలుతెప్పలుగా కూల్చేశాం
- ఉగ్రవాదులు కూడా ఊహించని దెబ్బ
- భారత్ మిలటరీ పవర్ యావత్ ప్రపంచం చూసింది
- ఆపరేషన్ సిందూర్‌లో బలగాలు ధైర్యం, తెగువను ప్రదర్శించాయి
- పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై గట్టి హెచ్చరిక
- అణ్వస్త్రాల బూచికి బెదరం
- ప్రధాని నరేంద్ర మోదీ
- మన సైన్యం చూపిన తెగువకు సెల్యూట్

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఇంత పెద్దఎత్తున భారత్ ప్రతిస్పందిస్తుందని టెర్రరిస్టులు సైతం ఊహించలేదని, మన క్షిపణలు, డ్రోన్లు పాక్ ఉగ్రశిబిరాల బీషణంగా గర్జించడంతో టెర్రరిస్టు స్థావరాలు నేలమట్టమయ్యాయని అన్నారు. పాకిస్తాన్ డ్రోన్లను కుప్పలుతెప్పలుగా కూల్చేయడం ద్వారా భారత్ మిలటరీ పవర్ ఏమిటో యావత్ ప్రపంచం చూసిందన్నారు.



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

'ఆపరేషన్ సింధూర్' సింధూర్ విజయాన్ని ఈ దేశ మహిళలకు అంకితమిస్తున్నామని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి జాతిని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తేజపూర్వక ప్రసంగం చేశారు.ఆపరేషన్ సిందూర్‌లో బలగాలు ఎంతో ధైర్యం ప్రదర్శించాయని, మన సైన్యం తెగువకు, శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నానని మోదీ అన్నారు. పాక్ డ్రోన్లను గాలిలోనే సైన్యం కూల్చేసిందని, టెర్రరిస్టులను సమూలంగా మట్టుపెట్టేందుకు సైన్యానికి సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చామని చెప్పారు. ''మన ఆడకూతుళ్ల నుదుట సిందూరం తుడిచిపెట్టిన

..మిగతా 2 లో

# పాక్ దాడులను తిప్పికొట్టాం

- ఆపరేషన్ విజయవంతమైంది
- పాక్‌లో సామాన్య పౌరులకు ఎటువంటి నష్టం జరగలేదు
- పాకిస్థాన్ నష్టానికి పాకిస్థాన్ ఆర్మీదే కారణం
- ఆపరేషన్ సింధూర్‌లో స్వదేశీ తయారీ ఆకాశ్‌ను సమర్థంగా వినియోగించాం
- తమ పోరాటం ఉగ్రవాదులతోనే కానీ.. పాకిస్థాన్‌తో కాదు
- ఎయిర్ మార్షల్ ఎ.కె. భార్తీ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైందని ఎయిర్ మార్షల్ ఎ.కె. భార్తీ వెల్లడించారు. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశామన్నారు. పాక్‌లో సామాన్య పౌరులకు ఎటువంటి నష్టం జరగలేదని తెలిపారు. పాక్ వైపు నుంచి దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలువురు ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆ క్రమంలో ఎయిర్ ఫోర్స్

..మిగతా 2 లో




# మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఫలితాలు రిలీజ్

- 46.86 శాతం ఉత్తీర్ణత
- వెబ్ సైట్ లో మార్కులు, ర్యాంకుల జాబిత

2 లో



# అడవుల్లో కాల్పుల మోత

- ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ దెబ్బ
- ఎన్‌కౌంటర్‌లో 20 మంది మృతి
- బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో మావోలు ఉన్నట్లు

..మిగతా 2 లో

# పాక్ కవ్వింపు చర్యలు

- మరోసారి కాల్పుల విరమణకి తూట్లు
- ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్
- సాంబా సెక్టార్‌లోకి పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడింది
- కథువా, ఆర్‌ఎస్ పుర, ఉదంపూర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్లుతో దాడికి
- మళ్ళీ ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం
- మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగం
- కొన్ని నిమిషాలకే పాక్ చర్యలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇరు దేశాల మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ తాజాగా తూట్లు పొడిచింది. సోమవారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లోకి పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడింది. సాంబాతోపాటు కథువా, ఆర్‌ఎస్ పుర, ఉదంపూర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్లుతో పాకిస్థాన్ దాడికి దిగింది. వీటిని భారత్ సైన్యం

..మిగతా 2 లో

# దేశ భద్రత కోసం ఇస్రో తీవ్ర కృషి

- దేశ భద్రతకు 10 ఉపగ్రహాలు
- దేశ భద్రత కోసం ఇస్రో వివేష కృషి
- భారత పౌరుల భద్రతే లక్ష్యం
- ఉపగ్రహాలు నిరంతరం భారత సరిహద్దులను పర్యవేక్షిస్తున్నాయి
- ఇస్రో చైర్మన్ వి.నారాయణన్



విశాలభారతి,స్టేట్ బ్యూరో:

భారత పౌరుల భద్రత కోసం, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం 10 ఉపగ్రహాలు నిరంతరం పనిచేస్తున్నాయని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. భారత్‌పాక్ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషి గురించి ఆయన వివరించారు. ఇంఫాల్లో జరిగిన సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ ఆయన ఈ కీలక అంశాలను వెల్లడించారు. మన పొరుగువారి (పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనా) గురించి మీ అందరికీ తెలుసు. అందుకే మన దేశ భద్రత కోసం, ఉపగ్రహాలను వినియోగించాల్సిందే. మనకు దాదాపు 7000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. కనుక ఆ తీర ప్రాంతాలను

..మిగతా 2 లో



# లైన్ మెన్ నుంచి సీఎండీ వరకు ఒక్కటే యూనిఫాం

- అంతా ఒక్కటేనని చాటేందుకు - నిఫ్టీతో డిజైనింగ్.
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటా
- డిమాండ్ ఎంత పెరిగినా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా
- ఎస్పీడీసీఎల్ సిబ్బందితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్రాక్షన్

..మిగతా 2 లో

# విద్యా వ్యవస్థలో మార్పు రావాలి

- రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా తీర్చి దిద్దడంపై మేధోమథనం
- ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై సుదీర్ఘ చర్చ
- తల్లిదండ్రులు, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల అభిప్రాయాల సేకరణ
- ప్రైవేట్ స్కూల్స్ కు దీటుగా సర్కార్ బడులను మార్చాలి
- మంత్రి శ్రీధర్ బాబు
- విద్యా రంగంలో సంస్కరణల'పై మంత్రి వర్గ ఉప సంఘం భేటీ

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

విద్యా వ్యవస్థలో మార్పు రావాలని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తెలంగాణను తీర్చిదిద్దాలని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. సచివాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం, విద్యా శాఖాధికారులతో.. మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన ‘విద్యా రంగంలో సంస్కరణలు’ అనే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం సుదీర్ఘ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ప్రైవేట్



..మిగతా 2 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
13.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# పాక్ ఎయిర్ బేస్‌ల ధ్వంసం..

తరువాయి భాగం

గమనార్హం. అలాగే పాకిస్థాన్ పంజాబ్‌లోని రహిమ్ యార్ ఖాన్ ఎయిర్ బేస్ రన్‌వే సైతం ధ్వంసమైన మరో వీడియోను సైతం ప్రదర్శించారు. మే 7వ తేదీన భారత్ ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించి.. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ సైన్యం దాడి చేసింది. అందులోభాగంగా లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్‌తోపాటు హిజ్బుల్ ముజాహిద్దీన్ తదితర ఉగ్రవాద గ్రూప్‌లకు చెందిన శిబిరాలను ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారని భారత్ ఇప్పటికే ప్రకటించింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతి చర్యగా పాకిస్థాన్ స్పందించింది. ఆ క్రమంలో భారత్ పశ్చిమ ప్రాంతాలపైకి డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. వీటిని భారత్ తిప్పికొట్టింది. అంతేకాకుండా.. పాకిస్థాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి.. రాడార్ ఇన్‌స్టాలేషన్, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లతోపాటు రఫీక్, చక్లాలా, రహీమ్ యార్ ఖాన్, సుక్కూర్‌తోపాటు సియాల్‌కోట్‌లోని ఆయుధగారాలను ధ్వంసం చేసింది. దాదాపు భారత్, పాకిస్థాన్‌ల మధ్య దాదాపు నాలుగు రోజుల పాటు హోరా హోరీ దాడులు, ప్రతి దాడులు చోటు చేసుకున్నాయి. అనంతరం శనివారం సాయంత్రం ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. అయితే ఈ ఒప్పందం చేసుకున్న కొద్ది గంటలకే భారత్ సరిహద్దు వెంబడి కాల్పులు జరిపి.. పాకిస్థాన్ మళ్లీ తన తెంపరితనాన్ని చాటుకొంది.

# మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఫలితాలు రిలీజ్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ మోడల్ స్కూల్ లో ప్రవేశాలకు నిర్వహించిన అడ్మిషన్ టెస్ట్ పరీక్ష ఫలితాలు రిలీజయ్యాయి. ఈమేరకు మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. ఈ పరీక్షకు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 40,331 మంది దరఖాస్తు చేసుకోగా.. 30,884 మంది హాజరయ్యారు. అందులో 14,473(46.86%) మంది ఉత్తీర్ణత సాధించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఆయా మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు చేపట్టనున్నారు. విద్యార్థులు తమ మార్కులను http://telangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా మార్కులు, ర్యాంకుల జాబితాను చెక్ చేసుకోవచ్చని అధికారుల సూచించారు.



# అడవుల్లో కాల్పుల మోత

- ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ దెబ్బ
- ఎన్‌కౌంటర్‌లో 20 మంది మృతి
- బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో మావోలు ఉన్నట్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సోమవారం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతా బలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో బీజాపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులతోపాటు భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలు తారసపడడంతో.. మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. దీంతో భద్రతా బలగాలు సైతం వెంటనే స్పందించి కాల్పులు ప్రారంభించాయి. దీంతో ఇరు వైపులా కొన్ని గంటల పాటు హోరా హోరీగా కాల్పులు జరిగాయి. అనంతరం మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. దాంతో భద్రతా బలగాలు పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టాయి. అందులోభాగంగా ఆ ప్రాంతంలో 20 మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు కనుగోన్నాయి. అయితే పలువురు మావోయిస్టులు పారిపోయినట్లు భద్రతా బలగాలు భావిస్తున్నాయి. ఆ క్రమంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని గడ్చిరోలి జిల్లాలో మవోయిస్టులకు చెందిన ఆయుధాలను పోలీసులు భారీగా స్వాధీనం చేసుకున్నారు. ఇంకోవైపు ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో 20 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులు నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా ఆపరేషన్ కగార్‌ను చేపట్టింది. ఆ క్రమంలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గడ్‌లో వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసింది. దీంతో భద్రతా బలగాలకు వరుసగా కూబింగ్ నిర్వహిస్తోంది. దాంతో సదరు రాష్ట్రంలో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టులు.. భారీగా తమ సహచరులను కోల్పోయారు. మావోయిస్టులు లొంగిపోవాలంటూ కేంద్రం పిలుపు నిచ్చింది. తద్వారా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారికి పిలుపు నిచ్చింది. దీంతో పలువురు మావోయిస్టులు ఇప్పటికే పోలీసులు, భద్రతా బలగాల ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే.

# సింధూర్ విజయాన్ని ఈ దేశ మహిళలకు అంకితం



తరువాయి భాగం

వారు ఎలాంటి ఫలితాన్ని అనుభవించాల్సి వస్తోంది ప్రతీ టెర్రరిస్టు, టెర్రరిస్టు సంస్థకు తెలిసొచ్చింది'' అని అన్నారు. ఆపరేషన్ సిందూర్ కేవలం పేరు కాదు, 140 కోట్ల భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక అని అన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై గట్టి హెచ్చరిక చేశారు. అణ్వస్త్రాల బ్లాక్‌మెయిల్‌ను ఇండియా సహించేది లేదని, ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత ఆక్రమిత కశ్మీర్‌పైనే పాక్‌తో చర్చలుంటాయని మోదీ స్పష్టం చేశారు.

**పాకిస్థాన్ గుండెల్లో బాంబులు పేల్చిన భారత్**

ఆపరేషన్ సిందూర్‌లో బలగాలు ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మన సైన్యం చూపిన తెగువకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి, శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. అమాయక పౌరులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీ సోమవారం న్యూఢిల్లీలో జాతినుద్దేశించి ప్రసంగించారు.

మన దేశం వీరత్వాన్ని చాటుకుందన్నారు. మన మహిళల సిందూరాన్ని దూరం చేస్తే.. ఏమవుతుందో చూపించామని చెప్పారు. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని దెబ్బ కొట్టామన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేశామని వివరించారు. అలాగే ఉగ్రవాద కేంద్రాలను సైతం ధ్వంసం చేశామని ఆయన పేర్కొన్నారు. 100 మంది కరుడుగట్టిన ఉగ్రవాదులను సైతం హతమార్చామని ప్రధాని మోదీ సోదాహరణగా వివరించారు. ఉగ్రవాదులపై దాడులకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని గుర్తు చేశారు. సైన్యం చేసిన దాడికి పాకిస్థాన్ సైతం నివ్వెరపోయిందన్నారు. పాకిస్థాన్ నిఘా, సాంకేతికత భారత్ ముందు తేలిపోయిందని పేర్కొన్నారు. ఉగ్రవాదులను నియంత్రించాల్సిన పాక్ మనపై ఎదురు దాడి చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మన స్కూల్స్, ఆస్పత్రులు, గురుద్వారాలను టార్గెట్ చేసిందని వివరించారు. పాకిస్థాన్ డ్రోన్లు, మిస్సైల్స్ కూల్చివేశామని ప్రధాని మోదీ తెలిపారు.

పాక్ మిస్సైల్స్ భారత్‌లోకి రాలేకపోయాయన్నారు. మనం మాత్రం పాకిస్థాన్ గుండెల్లో బాంబులు పేల్చామని చెప్పారు. పాకిస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌లను సైతం ధ్వంసం చేశామన్నారు. మన దెబ్బకు పాకిస్థాన్ విలవిలలాడిపోయిందని ప్రధాని మోదీ గర్వంగా చెప్పారు. భారత్‌ను ఎదుర్కో లేక ప్రపంచ దేశాల సాయాన్ని పాకిస్థాన్ కోరిందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేశారు.

పాకిస్థాన్ చర్యలను బట్టే మన చర్యలు ఉంటాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడ్డా తిప్పికొడతామన్నారు. పాక్ అణు బ్లాక్ మెయిలింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. త్రివిధ దళాలు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదం అంతానికి అన్నిరకాల వ్యూహాలతో సిద్ధంగా ఉన్నామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. పాక్ తోక జాడిస్తే తీవ్ర పరిణామాలు తప్పవంటూ ఆ దేశాన్నిహెచ్చరించారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# పాక్ దాడులను తిప్పికొట్టాం

తరువాయి భాగం

డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ ఎయిర్ మార్షల్ ఎ.కె.భార్తీ మాట్లాడుతూ.. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశామని ఆయన పేర్కొన్నారు. దాయాది దేశంలో జరిగిన నష్టానికి పాకిస్థాన్ ఆర్మీదే బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థతో పాక్ క్షిపణులు, డ్రోన్లను తిప్పికొట్టామని చెప్పారు. చైనా తయారు చేసిన పీఎల్ 15 క్షిపణిని నేలకూల్చామన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో స్వదేశీ తయారీ ఆకాశ్‌ను సమర్థంగా వినియోగించామని ఎ.కె.భార్తీ వెల్లడించారు. మన కౌంటర్ సిస్టం టర్కీ డ్రోన్లనే కాదు.. దేనినైనా పడగొట్టగలమన్నారు. దేశీయ పరిజ్ఞానం గొప్పగా ఉందని తెలిపారు. జైష్, లష్కరే నేతల పేర్లతో గందరగోళం సృష్టించేందుకు పాక్ ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. తమ పోరాటం ఉగ్రవాదులతోనే కానీ.. పాకిస్థాన్‌తో కాదని ఆయన తేల్చి చెప్పారు. అయితే ఉగ్రవాదులు కొన్నాళ్లుగా తమ వ్యూహాలను మార్చుకుంటున్నారన్నారు. ఈ యుద్ధంలో ఏయే ఆయుధాలు ఉయోగించామో వెల్లడించలేమని ఆయన పేర్కొన్నారు. ఇదోక వినూత్నమైన యుద్ధమన్నారు. గతంలోలాగా ఉండదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిపోయిందని చెప్పారు. తమ పోరాటం తీవ్రవాదుల మౌలిక సదుపాయాలపై దాడులు చేయడంపై మాత్రమేనని స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఆర్మీ మద్దతుగా నిలబడుతోందని గుర్తు చేశారు. సరిహద్దుల వద్ద భారత వాయిసేన.. తన ఆయుధ సంపత్తితో ఎదుర్కుందని వివరించారు. ఉగ్రవాదులకు అండగా నిలిచినందుకు.. భారత వాయుసేన ఆగ్రహాన్ని పాకిస్థాన్ చవి చూడాల్సి వచ్చిందన్నారు. దేశీయంగా తయారైన గగనతల రక్షణ వ్యవస్థ పాకిస్తాన్ పంపిన డ్రోన్లను కూల్చి వేసిందని చెప్పారు.శత్రు దేశానికి సంబంధించిన దాడులు అడ్డుకోవడంలో భారత వాయిసేన సమర్థవంతంగా వ్యవహరించిందని ఆయన స్పష్టం చేశారు.

# పాక్ కవ్వింపు చర్యలు

తరువాయి భాగం

తిప్పికొట్టింది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగం కొన్ని నిమిషాలకే పాక్ ఈ తరహా చర్యలకు దిగింది. ఇక పాకిస్థాన్‌తో సరిహద్దులుగా ఉన్న పంజాబ్ జిల్లాలతోపాటు రాజస్థాన్‌లోని పలు జిల్లాల్లో బ్లాక్ అవుట్ విధించారు. ఇంకో వైపు భారత్, పాకిస్థాన్‌లకు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్ సోమవారం నిర్వహించిన కీలక భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సరిహద్దుల్లో కాల్పులు, కవ్వింపులు ఉండరాదని నిర్ణయించారు. అలాగే ఇరువైపుల నుంచి ఒక్క బుల్లెట్ కూడా పేలకూడదని చర్చల్లో ప్రస్తావించారు. ఇరువైపుల నుంచి కవ్వింపు చర్యలు ఉండకూడదని నిర్ణయం తీసుకున్నారు. సరిహద్దుల నుంచి బలగాలు తగ్గించాలని స్పష్టం చేసుకున్నారు. అలాగే బలగాల తగ్గింపునకు తగిన చర్యలు తీసుకోవాలని వారు నిర్ణయించారు. ఈ డీజీఎంవో నిర్ణయాలు తీసుకున్న కొన్ని గంటలకే పాకిస్థాన్ తన తెంపరితనాన్ని కాల్పుల విరమణ ఉల్లఘించడం ద్వారా చాటుకొంది. ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. ఈ దాడి వెనుకు పాకిస్థాన్ ఉందనే బలమైన సాక్ష్యాలను భారత్ సంపాదించింది. వీటిని ప్రపంచం ముందు ఉంచింది. అనంతరం పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అలాగే భారత్‌కు వ్యతిరేకంగా పాక్ సైతం అదే తరహాలో చర్యలు చేపట్టంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ క్రమంలో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడి చేశారు. దీనికి ఆపరేషన్ సిందూర్ అని భారత్ పేరు పెట్టింది. ఈ దాడి అనంతరం పాకిస్థాన్ సరిహద్దులుగా ఉన్న భారత్‌లోని పలు రాష్ట్రాలపై క్షిపణులు, డ్రోనులతో దాడి చేశారు. వీటిని భారత్ తిప్పికొట్టింది. దాదాపు నాలుగు రోజుల అనంతరం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం చేసుకున్న అనంతరం పాక్ వరుసగా రెండో సారి ఉల్లంఘించినట్లు అయింది.

# దేశ భద్రత కోసం ఇస్రో తీవ్ర కృషి

తరువాయి భాగం

మనం నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ప్రధానంగా మొత్తం ఉత్తర భాగాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. శాటిలైట్, డ్రోన్ టెక్నాలజీలు లేకుండా దానిని మనం చేయలేం' అని వి.నారాయణన్ పేర్కొన్నారు. భారత్‌పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో, గత కొన్ని రోజులుగా ఉత్తర, పశ్చిమ అంతర్జాతీయ సరిహద్దుల (ఐబీ) వెంబడి రాత్రిపూట భారీ స్థాయిలో దాడులు, ప్రతిదాడులు జరిగాయి. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి భారత్, పాక్లు అంగీకరించిన నేపథ్యంలో, ప్రస్తుతం జమ్మూకశ్మీర్ సహా ఐబీ వెంబడి ఉన్న ప్రాంతాలు కాస్త ప్రశాంతంగా ఉన్నాయని భారత భద్రతా బలగాలు పేర్కొన్నాయి. ఏప్రిల్ 22న పాక్కు చెందిన ఉగ్రవాదులు భారత్లోకి చొరబడి, జమ్మూకశ్మీర్లోని పహల్గాం వద్ద మారణహోమం సృష్టించారు. హిందూ పర్యాటకులే లక్ష్యంగా కాల్పులు జరిపి మొత్తం 26 మందిని పొట్టనపెట్టుకున్నారు. దీనితో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాక్, పీవోకేల్లోని 9 ఉగ్రస్థావరాలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేసింది. దీనితో పాక్ హమాస్ ఉగ్రవాదుల తరహాలో భారత సరిహద్దు ప్రాంతాల్లోని జనావాసాలపై, సైనిక స్థావరాలపై దాడికి యత్నించింది. అయితే సర్వసన్నద్ధంగా ఉన్న భారత త్రివిధ దళాలు పాక్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. పాక్కు చెందిన ఎఫ్16 సహా 3 ఫైటర్ జెట్లను, 50కి పైగా డ్రోన్లను కూల్చేశాయి. అంతేకాదు పాకిస్థాన్లోని 11 వైమానిక స్థావరాలను నాశనం చేశాయి. దీనితో పాకిస్థాన్ భారీగా నష్టపోయింది. దీనితో ఏం చేయాలో తెలియక, ఉక్రోశంతో భారత్ సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా, గుజరాత్లపై పాక్ భారీగా షెల్లింగ్, డ్రోన్ దాడులకు ప్రయత్నించింది. అయితే వాటిని కూడా భారత దళాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. ఇప్పటి వరకు 100 మందికి పైగా ఉగ్రవాదులను భారత భద్రతా దళాలు మట్టుబెట్టాయి. దీనితో దిగివచ్చిన పాక్ కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించింది.

**దెబ్బకు దిగొచ్చిన పాక్**

ఆదివారం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో, లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ (డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్) ఇతర సైనిక అధికారులతో కలిసి ఆపరేషన్ సిందూర్ ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్ దెబ్బకు పాక్ దిగి వచ్చి, యుద్ధం ఆపాలని కోరిందని ఆయన పేర్కొన్నారు. "నేను పాకిస్థాన్ డీజీఎంఓతో మాట్లాడాను. అప్పుడు పాక్ డీజీఎంఓ యుద్ధం ఆపాలని ప్రతిపాదించింది. దీనితో ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది. దీనితో సరిహద్దుల్లో కాల్పులు, వైమానిక చొరబాట్లను పాక్ నిలిపివేసింది. దీనిని దీర్ఘకాలంపాటు కొనసాగించడానికి మే 12న మధ్యాహ్నం 12 తరువాత మరోసారి చర్చించాలని మేము నిర్ణయించుకున్నాం" అని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చెప్పారు.

# విద్యా వ్యవస్థలో మార్పు రావాలి

తరువాయి భాగం

పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రధానంగా చర్చించారు. అలాగే.. రాబోయే రోజుల్లో తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా ఉండేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై మంత్రి వర్గ ఉపసంఘం చర్చించింది. ఇతర రాష్ట్రాల అధికారులు మన దగ్గరికొచ్చి అధ్యయనం చేసేలా మార్పు తీసుకరావాలని సంబంధిత యంత్రాంగానికి సూచించింది.ఈసందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై తల్లిదండ్రులు, సంబంధింత యాజమాన్యాల అభిప్రాయాలు సేకరించామని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ప్రైవేట్ ఇంటర్నేషనల్ స్కూల్స్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పమని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సర్కార్ బడుల్లో పని చేసే ఉపాధ్యాయులను అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చి దిద్దేందుకు కావాల్సిన శిక్షణపై సమావేశంలో చర్చించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేట్ విద్యా సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో గ్రేడింగ్ కొనసాగిస్తారా..? మార్కులు ఇస్తారా..? లేదా ఈ ఏడాది మాదిరిగానే రెండింటిని కొనసాగిస్తారా అనే అంశంపై తల్లిదండ్రులు, విద్యార్థులకు ముందు నుంచే అవగాహన కల్పించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలిచ్చే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్(ఆర్టీఈ)ను తప్పనిసరిగా అమలు చేస్తామని, ఇందుకోసం ఎంత బడ్జెట్ అయినా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులకు మరింత పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో కామన్ డిటెన్షన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు ప్రారంభించామన్నారు. ఒకే రకమైన ఎగ్జామ్ ఫీజును కూడా రూపొందిస్తామన్నారు. 202526 నుంచి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా వెయ్యి ప్లే స్కూల్స్ ను అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించబోతున్నట్లుగా చెప్పారు. ఈ సమావేశంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు యోగితా రాణా, దేవసేన, హరిత, నర్సింహా రెడ్డి, కృష్ణాదిత్య, ట్రస్మా ప్రతినిధులు ఎస్ఎన్ రెడ్డి, మధుసూదన్, హెచ్ఎస్పీఏ నుంచి వెంకట సాయినాథ్, ఇస్మా ప్రతినిధులు సునీల్ కుమార్, వైసీ చౌదరి, ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నుంచి అన్వర్ అహ్మద్, క్రిస్టియన్ అసోసియేషన్ తరపున బాలశౌరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లైన్ మెన్ నుంచి సీఎండీ వరకు ఒక్కటే యూనిఫాం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

డిస్కంలలో పనిచేస్తున్న లైన్ మెన్ నుంచి మొదలుకుని సీఎండీ వరకు అందరికీ ఒకే తరహా యూనిఫాం తీసుకురావాలని ఆలోచన చేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తామంతా ఒక్కటేననే చాటిచెప్పేందుకు దీన్ని అమలుచేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)తో డిజైన్ చేయించి విద్యుత్ సిబ్బందికి డ్రెస్సులు ఇస్తామని ప్రకటించారు. హైదరాబాద్ ప్రజా భవన్ లో ఎస్పీడీసీఎల్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందితో సోమవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్రాక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా అంతరాయం లేకుండా నిరంతరంగా సరఫరా చేసే స్థాయికి ఎదిగామంటే దానికి సిబ్బంది నిబద్ధతతోకుటుంబంలా పనిచేయడం వల్లనే సాధ్యమైందని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరెంటు ఉండదని దుష్ప్రచారం చేసిన వారికి చెంపపెట్టులా ఈ ఏడాది మార్చిలో 17,162 మెగావాట్లకు పైగా పిక్ డిమాండ్ వచ్చినప్పటికీ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసి వారి విమర్శలను తిప్పి కొట్టామని, అందుకు విద్యుత్తు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సిబ్బందిని ప్రజా ప్రభుత్వం ఎప్పటికీ ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పదోన్నతుల సమస్యను అధికారులంలోకి రాగానే పరిష్కరించి వేలమందికి పదోన్నతులు కల్పించినట్లు భట్టి వివరించారు. నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం తమది కాదని, ప్రతి ఆలోచన అందరితో పంచుకుంటామని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని భట్టి విద్యుత్ సిబ్బందికి భరోసా ఇచ్చారు.



ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ హాజరయ్యారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
13.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తాం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను రిలీజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కార్యాలయంలో సోమవారం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్మెంట్ల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఫీజు బకాయిల కోసం 40 రోజులుగా మేనేజ్మెంట్లు ఆందోళన చేస్తున్నాయి. ఈ ఫీజుల బకాయిల సమస్యను సీఎం దృష్టికి తీసుకుపోయినట్టు బాలకిష్టారెడ్డి మేనేజ్మెంట్లకు వివరించారు. బకాయిలు విడుదల చేయించే బాధ్యత తనదేనని బాలకిష్టారెడ్డి వారికి హామీనిచ్చారు. దీంతో కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రైవేట్ కాలేజీలు సమ్మెను విరమించినట్లు ఆయన ప్రకటించారు. కాగా పలు వర్సిటీల్లో జరిగే సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని మేనేజ్ మెంట్లు స్పష్టం చేశాయి.

GENERAL NEWS

# ప్రభుత్వమే పట్టాలిచ్చి తిరిగి తీసుకోవడం పద్ధతికాదు

దేవరుప్పుల, విశాలభారతి:





ప్రభుత్వ భూములను ప్రభుత్వమే పంపిణీ చేసి పట్టాలిచ్చి తిరిగీ తీసుకోవాలనే ప్రయత్నన్నీ విరమించుకోవాలని బహుజన్ సమజ్ పార్టీ డిమాండ్ చేస్తున్నాం. ఈ రోజు బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డా. రాపాక శ్రీశైలం గారు మరియు చింత గణేష్ పాలకుర్తి నియోజక వర్గ ఉపాధ్యక్షులు గారలు లబ్ధిదారులు పాలడుగు యాదగిరి మహంకాళి మధు ఈటికాల నవీన్ దుబ్బాక శ్రీనివాస్ బాషిపాక ఎల్లయ్య తో కలిసి దేవరుప్పుల మండల చిన్నమాడుర్ రంబోజిగూడెం లో సర్వే నెంబర్ 524 525 526 527 లో ప్రభుత్వ భూమి 48 ఎ 11 గుంటల భూమి 2008 సం లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 68 మంది భూమీ లేని ఎస్సీ ఎస్టీ బీసీ ఓబీసీ లకు 18 గుంటల చొప్పున పట్టాలు పంపిణీ చేసిందీ కొద్ది మంది వ్యవసాయం చేసుకుంటున్నారు పోయిన బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా భూమీ లేని 25 మంది పేద వారిని గుర్తించి వారికి కూడా పట్టాలు పంపిణీ చేసారు 527 సర్వే నెంబర్ లో ఉన్న భూమీ నీ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం బబుల్ బెడ్ రూమ్ లకు హరిత హరానికి క్రీడా ప్రాంగణానికి డంప్ యార్డ్ కూడా వినియోగించింది ఎంతో మంది భూమీ లేని లబ్ధిదారులుగా ఉన్న ఈ భూములను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రైతుల నుంచి తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు తక్షణమే ఈ ఆలోచనను విరమించుకోవాలని రైతులను రాజులు చేస్తామని, చెప్పారు. ఈ ప్రభుత్వం లేని బడుగు బలహీన వర్గాల రైతులను ఆదుకోవాలని వారి భూముల్లో జోక్యం చేసుకోకూడదు. అని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. ఒకవేళ మీ ప్రయత్నాలు ఆపక పోతే వారి పక్షాన బహుజన సమాజ్ పార్టీ వుంటుంది.అని వారికి బరోసా కల్పించారు.

# అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రదర్శించ వద్దు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష

పటాన్ చెరు,విశాలభారతి



బల్దియా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తిచేసే ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు..సోమవారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి పరిధిలోని రామచంద్రపురం, భారతి నగర్, పటాన్ చెరు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు డివిజన్ల పరిధిలో శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న పనులపై అధికారులు రోజు వారి తనిఖీలు చేపట్టాలన్నారు. నిధులకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అభివృద్ధి పనులు నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా సర్కిల్ 22 ఈఈ సురేష్, డిఈలు నరేందర్, దేవదేందర్, ఏఈ లు శివ కుమార్, దివ్య తేజ పాల్గొన్నారు.




# గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్

గరిడేపల్లి, విశాలభారతి:

సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ హుజూర్నగర్ డివిజన్ ప్రజాసంఘాల సమావేశం గరిడేపల్లి మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో నాగన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఈనెల 20న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలన్నారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, నాలుగు లేబర్ కోడ్ ను రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల అమ్మకాన్ని ఆపాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రైతులకు మద్దతు ధర చట్టం చేయాలని, పాత అప్పులు రద్దు చేయాలని, రైతులకు నష్టం చేసే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పని రోజులు 200 పెంచాలని రోజు కూలి 600 రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా తదితర డిమాండ్లతో మే 20 జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్ కు పెద్ద ఎత్తున కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు పోటు లక్ష్మయ్య, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కామల నవీన్, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి వీ నరసింహారావు, పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి, ఐఎఫ్టియు జిల్లా నాయకులు కామల శ్రీను, నాగయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు, సీనియర్ నాయకులు అంజయ్య, పివైఎల్ నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ సేవలు మరువలేనివి

- సేవా కార్యక్రమాల్లో ముందంజ
- అసాంఘిక శక్తులను కట్టడి చేయడంలో మేటి
- గుత్తకోయ గ్రామాల అభివృద్ధిలో పోలీస్ పాత్ర మరువలేనిది
- అక్రమార్కుల పట్ల సింహ స్వప్నం

పినపాక, విశాలభారతి:

ఉన్నతాధికారుల ఆదేశాల సూచనల మేరకు ప్రజల మన్నలు పొందుతున్న ఈ బయ్యారం పోలీస్. పోలీస్ అంటే వామ్మో, భయం అనే ధోరణికి సమర గీతం పలికి ఫ్రెండ్లీ పోలీస్, పోలీస్ అంటే అభయం, ఉన్నత శాఖ అధికారుల ఆదేశాలు సూచనల మేరకు ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు అందిన తక్షణమే స్పందిస్తూ శభాష్ పోలీస్ అనే విధంగా ఈ బయ్యారం పోలీసు ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా అనేక గ్రామాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, గుత్తి కోయ గ్రామాల్లో ప్రజానీకానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు, గంజాయి మహమ్మారిని కోడిపందాలు, పేకాటను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ అనేక మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

- భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డికు వినతి

పటాన్ చెరు,విశాలభారతి



డివిజన్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలిసి డ్రైనేజీ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. భారతినగర్ డివిజన్ పరిధిలో సుమారు 2 కోట్లతో డ్రైనేజ్ పైపులైన్లకు కొత్త ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రామచంద్రాపురం మెయిన్ రోడ్డులో ఇటీవల నేషనల్ హైవే రోడ్ వెడల్పులో భాగంగా డ్రైనేజ్ లైన్ ను స్టార్మ్ వాటర్ డ్రైన్ లో కలపడంతో కాలనీలో తీవ్ర డ్రైనేజ్ సమస్య ఉందని చెప్పారు. నేషనల్ హైవే రోడ్ సమాంతరంగా డ్రైనేజ్ పైప్ లైన్ లకు 2 కోట్ల పనులు మంజూరు చేయాలని కోరారు. మ్యాక్ సొసైటీ, ఎల్ఐజీ కాలనీ, ఫెన్సింగ్ ఏరియాలో డ్రైనేజ్ సమస్య ఉందని, ఇందుకు సుమారు 2కోట్ల ప్రతిపాదనలకు మంజూరు చేయాలని కోరారు. మ్యాక్ సొసైటీ కాలనీలో పెండింగ్ లో ఉన్న మంచినీటి బిల్లులు ఓటిస్ స్కీమ్ ఒకేసారి సెటిల్ మెంట్ చేసి డబ్బులు కట్టినా నీటి బిల్లులు వస్తున్నాయని, వాటిని త్వరగా మాఫీ చేసి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జలమండలి ఎండి సానుకూలంగా స్పందించి అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ సింధు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.



# పోలీసు సాలరీ ప్యాకేజ్ గురించి అవగాహన కలిగి ఉండాలి

- సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోమ్ గార్డ్ మచ్చెందర్ కుటుంబానికి బాసట
- యాక్సిస్ బ్యాంక్ నుండి యాక్సిడెంటల్ డెత్ క్రింద రూ.34 లక్షల చెక్ లను జిల్లా ఎస్పీ అందజేత

పటాన్ చెరు,(సంగారెడ్డి)విశాలభారతి

పోలీసు సాలరీ ప్యాకేజ్ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, పోలీసు సాలరీ ప్యాకేజ్ కి మారవలసిందిగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. 2024 డిసెంబర్ 31 ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన హోమ్ గార్డ్ మచ్చెందర్ కుటుంబానికి యాక్సిస్ బ్యాంక్ నుండి యాక్సిడెంటల్ డెత్ క్రింద 30 లక్షలను, ఇద్దరు పిల్లల ఎడ్యుకేషన్ కొరకు తలా 2 లక్షల చొప్పున మొత్తం రూ.34 లక్షలు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. ఈ చెక్ లను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మచ్చెందర్ భార్య భాగ్యలక్ష్మికి అందజేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. అదేవిధంగా పోలీసు శాఖ నుండి రావలసిన అన్ని రకాల బెనిఫిట్స్ త్వరగా అందేవిధంగా చూస్తామని అన్నారు. పోలీసు శాఖ వారికి, వారి కుటుంబానికి ఎల్లవేళలా సహాయ సహకారాలను అందించడం జరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది పోలీసు సాలరీ ప్యాకేజ్ గురించి అవగాహన కలిగి, ఆయా బ్యాంక్ లలో ఉన్న సాలరీ అకౌంటులను పోలీసు సాలరీ ప్యాకేజ్ లోకి మార్చుకోవాలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా మచ్చెందర్ మరణానంతరం రావలసిన యాక్సిడెంటల్ బెనిఫిట్స్ ను సకాలంలో అందించిన యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్, బ్యాంక్ యాజమాన్యాన్ని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇ.కళ్యాణి, ఆర్.ఐ డానియెల్, రాజశేఖర్ రెడ్డి, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్, సిబ్బంది, మచ్చెందర్ కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# జవాన్ మురళి నాయక్ ఆత్మ శాంతించాలి

- హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

భారతదేశంలోని ప్రజలందరూ గుండెలపై చేయి వేసుకొని హాయిగా నిద్రపోతున్నారు అంటే భారతదేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి వీర పోరాటం కొనసాగిస్తున్న వీర జవాన్ల గొప్పతనమని సీఐ నాగరాజు గౌడ్ అన్నారు, పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించడంతో పాటు వీరమరణం పొందిన జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడుల్లో వీరమరణం పొందిన మురళి నాయక్ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉంటారని ఆయన మరణానికి కారకులైన పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను అంతమందించడమే ఆయనకిచ్చే గొప్ప గౌరవమని అన్నారు. భారతదేశానికి పాకిస్తాన్ ఉగ్రవాదులకు మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో తగిన జాగ్రత్తలు తీసుకొని జవాన్లను భారత పౌరులకు రక్షణ కల్పించాలని అన్నారు. అనంతరం జై జవాన్ జై భారత్ భారత్ మాతాకీ జైజై హింద్ అంటూ భారత జవాన్లకు తమ సంఘీభావం తెలియ చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీలో నిందించాలి. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ వెంకటరెడ్డి, ఎస్ఐ లక్ష్మి నారాయణతో పాటు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హయత్ నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది వివిధ కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# భగవంతుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- వర్టెక్స్ వర్మ

కూకట్ పల్లి, విశాలభారతి:

హైదర్ నగర్ డివిజన్ పరిధి శ్రీనివాసకాలనీలోని పర్వతవర్ధని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి సహిత శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రముఖ భవన నిర్మాణ సంస్థ వర్టెక్స్ అధినేత వేగేశ్న వెంకటరాయ వర్మ (వర్టెక్స్ వర్మ), ధర్మపత్ని లక్ష్మీకుమారి దంపతులు నూతనంగా నిర్మించిన మహా మండపం, రాజగోపురం శిఖర ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరిగాయి. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు, కాలనీ వాసుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వర్టెక్స్ వర్మ, లక్ష్మీకుమారి దంపతులు మహోత్సవాల్లో శాస్త్రోక్తంగా భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించి రాజగోపురం శిఖర ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా వర్టెక్స్ వర్మ మాట్లాడుతూ, ప్రజలందరిపై భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని కోరుకున్నట్లు చెప్పారు. పాడిపంటలతో ఉభయ తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. మహా మండపం, నూతన రాజగోపురం నిర్మాణపు దాత వేగేశ్న వెంకటరాయ వర్మ (వర్టెక్స్ వర్మ), ధర్మపత్ని లక్ష్మీకుమారి దంపతులకు కాలనీ వాసులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ ప్రధాన అర్చకులు శనగవరపు యశ్వంత్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## ముగిసిన ఈసెట్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:రాష్ట్రంలో బీఈ, బీటెక్, బీఫార్మసీ తదితర కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ ద్వారా సెకండియర్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీఈసెట్ ఎగ్జామ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 86 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఈ ఆన్ లైన్ ఎగ్జామ్ పాస్ వర్డ్ ను హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ కుమార్, ఈసెట్ కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు ఓయూలో రిలీజ్ చేశారు. ఈఎగ్జామ్ కు మొత్తం 19,672 మంది దరఖాస్తు చేసుకోగా 18,928(96.22%) మంది హాజరయ్యారు. హైదరాబాద్ రీజియన్ లో 12,039 మంది, తెలంగాణ జిల్లాల్లో 6,889 మంది పరీక్ష రాశారు.

GENERAL NEWS




## అమర జవాన్లకు నివాళులు అర్పించిన దివ్యాంగులు

- టీఎండిఏ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

**పటాన్ చెరు,విశాలభారతి**

భారత్ పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు ఇస్నాపూర్ లో దివ్యాంగులు ఘనంగా నివాళులర్పించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం వద్ద ఆదివారం రాత్రి కందర క్షీణిత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. శత్రు దేశమైన పాకిస్థాన్ కీ శ్రీరాముడు సత్ బుద్ధి ప్రసాదించాలని దివ్యాంగ కుటుంబాలు రామాలయం చుట్టూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టియండిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ మాట్లాడుతూ వీర జవాన్ల కన్న తల్లి తండ్రులకు పాదాభివందనాలనీ, వీర జవాన్ల త్యాగాలు వృథా కావన్నారు. వీర జవాన్ల కుటుంబాలకు మన మందరం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యువ చైతన్యం ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంచిగారి మహేష్ కుమార్, మణిరత్నం, సలహాదారులు బాపూ వెంకన్న, వెంకోబా, కంచిగారి శ్రీనివాస్, యువ చైతన్య కార్యవర్గ సభ్యులు జ్యోతి, సాయి, శేఖర్, సత్యనారాయణ రెడ్డి, దివ్యాంగ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## హెచ్ఎల్ లో ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు

**కూకట్ పల్లి, విశాలభారతి:**

హెచ్ఎల్ లో బుద్ధ పూర్ణిమ ను పురస్కరించుకొని హెచ్ ఎల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమానికి హేచ్ ఎల్ డీజీమ్ హెచ్. ఆర్ సూర్యకుమార్ రౌత్ విచ్చేసి బుద్ధుడికి పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు బోదించిన సూక్తులు ప్రపంచంలో అందరు పాటిస్తున్నారు అని శాంతి ని నెలకొల్పడం లో ఆయనను మించినవారు లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో హెచ్ఆర్ సియం ఐఆర్ ప్రహలాద్, సీనియర్ మేనేజర్ సత్యనారాయణ, రికగ్నిసెడ్ రికగ్నైస్డ్ యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, అసోసియేషన్ అధ్యక్షులు పట్టు రమేష్ కుమార్, ప్రధానకార్యదర్శి శశి కుమార్,ఏస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చూడమన్, రవికుమార్ ముదిరాజ్,శ్రీనివాస్ బాబు, నాగార్జున, విజయశ్రీ, పద్మ,లక్ష్మణ్, తిమ్మయ్య, విష్ణు, ప్రేమ్,మురళి, రామకృష్ణ, శ్రీధర్,రమేష్,జోగారావు, ప్రవీణ్, రాంబాబు, బిలియా,తదితరులు పాల్గొన్నారు




ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలో పాల్గొనడం జరిగిందని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



## కీసరలో భారీగా నిలవ ఉంచిన కెమికల్ డ్రమ్ములు

**కీసర, విశాలభారతి:**

కీసర పోలీస్ స్టేషన్ పరిధి నూకల గూడెంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో బారీగా నిలవచేస్తున్న కెమికల్ డ్రమ్ములు.నూకల గూడెంలో నివాసం ఉండే ప్రజలు భయ బ్రాంతులకు చెందుతున్నారు. ఇలాంటి కెమికల్ డ్రమ్ములు నిలవ ఉంచాలి అంటే కాలుష్య నియంత్రణ మండలి అధికారుల అనుమతులు పొంది ఉండాలి.అసలు జనారణ్యం లేని ప్రాంతంలో ఈ కెమికల్ డ్రమ్ములు నిలవ ఉంచితే ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఉంటుంది.సోమవారం స్థానికులు కొందరు ఇట్టి విషయంపై కీసర సి ఐ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన సి ఐ వాటిని పరిశీలించి కెమికల్ డ్రమ్ములు ఏమైనా ప్రమాదకరమైనవి ఉంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

# బావిభారత పౌరులు దృఢంగా ఉండాలి

- తల్లిదండ్రులు, గురువులు చెప్పేది బుద్దిగా నేర్చుకోవాలి.
- బాధ్యతగల పౌరులుగా, అందరికీ మంచి పేరు తెస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలి.
- ఆటలు మేధస్సును పెంచుతాయి.
- కె. నరసింహ ఎస్పీ

**సూర్యాపేట, విశాలభారతి**






పిల్లలు భావిభారత పౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులు, గురువులు చెప్పేది బుద్ధిగా నేర్చుకోవాలని, బాధ్యతగల పౌరులుగా, అందరికీ మంచి పేరు తెవాలని,ఆటలు మేధస్సును పెంచుతాయని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఐపిఎస్ అన్నారు. సోమవారం వేసవి సెలవుల సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో గల జిల్లా పరిషత్ పాఠశాల నందు జిల్లా పోలీస్, జిల్లా బాల భవన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణా శిబిరాన్ని ఎస్పీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు పిల్లల కోసం, కాలనీ పిల్లల కోసం ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించామని, దీనిలో పిల్లలకు మేధస్సు, జ్ఞాపకశక్తి, ప్రయోగాత్మక విధానం పెంపొందించే విధంగా ప్రయోగాత్మక ఇంటలిజెన్స్, యోగ, క్రాఫ్ట్, మ్యూజిక్, కర్రసాము, సాంప్రదాయ నృత్యం, సంగీత పరికరాలు, ఇండోర్ ఆటలు మొదలగు అంశాల గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల పిల్లలు ఎవరైనా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమం అనంతరం రిఫ్రెష్మెంట్ కోసం పిల్లలకు పండ్లు, బిస్కెట్ అందించారు. ఈ కార్యక్రమం నందు ఏ ఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ పార్థసారథి, జిల్లా బాల భవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణా రెడ్డి, భాల భవన్ సభ్యులు, రిటైర్డ్ అధ్యాపకులు అమిద్ ఖాన్, యోగా గురువు, జిల్లా బాల భవన్ ఉపాద్యాయులు పాల్గొన్నారు.



## ఉటుకూరి సైదులుకు పితృవియోగం

- పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్

**సూర్యాపేట, విశాలభారతి:**

చివ్వేంల మండల పరిధిలో ని మోదింపురం గ్రామానికి చెందిన బి ఆర్ యస్ పార్టీ సూర్యాపేట జిల్లా నాయకులు, మాజీ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ప్రస్తుత హైకోర్ట్ న్యాయవాది ఉటుకూరి సైదులు తండ్రి ఉటుకూరి జానయ్య (85) అకాల మరణం తీరని లోటని తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఉటుకూరి జానయ్య చిత్ర పటం వద్ద నివాళులు అర్పించి మృతుని భార్య ఉటుకూరి లక్ష్మమ్మ, కుమారులు సైదులు, నాగేశ్వరావు, ప్రసాద్, కూతుళ్లు యశోద, వినోద, శోభారాణి, తమ్ముడు యెసుదాసు వారిని క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమం లో పీపుల్ పౌండేషన్ చైర్మన్ యాతకుల సునీల్, యం. ఆర్. పి.యస్ రాష్ట్ర నాయకులు దుబ్బ రమేష్, యం. ఆర్. పి. యస్.సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కత్తి ఉపేందర్, యాదాసు గోపి, కత్తి వెంకన్న పాస్టర్ ఉటుకూరి రాజు, రెవ. ఏర్పుల క్రీస్టోఫర్, పాస్టర్ బాణాల సైమన్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు కుటుంబానికి ఆర్థిక చేయూత

- చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్.

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు పని చేస్తున్న కానిస్టేబుల్ రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగినది. దివంగత పోలీసు సిబ్బంది కుటుంబాల అవసరాలు తీర్చడంలో భాగంగా పోలీసు చేయూత పథకం ద్వారా కానిస్టేబుల్ రాంబాబు కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల పోలీసు చేయూత పథకం చెక్కును ఎస్పీ నరసింహ ఐపిఎస్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాంబాబు కుటుంబ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుందని, రాంబాబు కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని ఎస్పి తెలిపారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రతి నెల జీతం నుండి విరాళం అందిస్తున్నారని అభినందించారు. పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, కుటుంబ సభ్యులు కిరణ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బీసీ హక్కుల సాధన సమితి జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

**సూర్యాపేట, విశాలభారతి:**



ఈనెల 13న కోదాడ మున్సిపాలిటీ పరిధిలో ని బాలాజీ నగర్ లోని ఎల్ఐసి బిల్డింగ్స్ లో జరగనున్న బీసీ హక్కుల సాధన సమితి 3వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు ఒక ప్రకటనలో కోరారు. బీసీలు తమ హక్కులు సాధించుకునేందుకు నేటి పాలకులపై మరో స్వతంత్ర పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, బీసీల అభివృద్ధి అభ్యున్నతి కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం అవుతుందని, బీసీల సాధికారత కొరకు బీసీల ఆర్థిక స్వాలంభన కొరకు బీసీ యువత స్వయ ఉపాధి కొరకు ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలుస్తామని తరచూ పత్రికా ప్రకటనలు గుప్పిస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని ఒక ప్రభుత్వం ఇంటర్వ్యూలు నిర్వహించి చేతులు దులుపుకుంటే మరో ప్రభుత్వం దరఖాస్తులకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు.పాలకులు చెబుతున్న ఈ కల్లబొల్లి మాటలను బీసి జాతి సునిశితంగా గమనించాలని, వారి కపట ప్రేమను అర్థం చేసుకొని తగు రీతిలో బుద్ధి చెప్పాలని, ఏ ప్రభుత్వమైనా బీసీలను ఓట్లు వేసే యంత్రాలు గాని చూస్తున్నాయని ఎన్నికల సందర్భంగా అనేక వాగ్దానాలు చేస్తున్నారని, బీసీలకు అన్ని జిల్లాల్లో బీసీ గురుకుల కళాశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, అన్ని మండల కేంద్రాల్లో రైతు బజార్ల మాదిరి బీసీ బజార్లు ఏర్పాటు చేస్తామని 50 షాపులతో కూడిన మాల్ నిర్మాణం చేసి చేతివృత్తుల వారికి అందిస్తామని హామీ ఇచ్చి ఉన్నారని, 10 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను ఇస్తామని హామీలు గుప్పించారని ఆయన గుర్తు చేశారు .వీటన్నింటినీ సాధించుకోవాలంటే పాలకుల ఇచ్చిన హామీలను చర్చించి సాధించుకునేందుకు ఈ మహాసభలో వేదిక కానున్నదని తెలియజేశారు.



## మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపు

**బాల్కొండ,విశాలభారతి:**

ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సమస్యల పరిష్కారం కొరకు కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సమ్మెను జయప్రదం చేయాలని భీమ్‌గల్ మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు,సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయడంతో పాటు ప్రజలపైన భారాలు మోసే పద్ధతుల్లో ధరలను విపరీతంగా పెంచి అన్ని వర్గాల ప్రజలపైన ఆర్థిక భారాలు మోపుతున్నారని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పోరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని,కార్మిక వర్గం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 29చట్టాలను మార్చి నాలుగు కోట్లుగా విభజించారని తెలిపారు. వీటి మూలంగా కార్మికులు హక్కులు భరించబడతాయని తమ హక్కుల సాధన కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు నివ్వటం జరిగిందని అన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకొని ఎడల భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడాల్సి వస్తుందని హెచ్చరించారు.అనంతరం భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గంగాధర్ కు సమ్మె నోటీసును అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు భీమ్‌గల్ అధ్యక్షుడు ఓంకార్,కార్యదర్శి నవీన్,సహాయ కార్యదర్శి విజయ,ఉపాధ్యక్షులు విశ్వనాథ్,కోశాధికారి ప్రవీణ్, కార్మికులు తదితరలు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
13.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఫలితాలు రిలీజ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**తెలంగాణ మోడల్ స్కూల్ లో ప్రవేశాలకు నిర్వహించిన అడ్మిషన్ టెస్ట్ పరీక్ష ఫలితాలు రిలీజయ్యాయి. ఈమేరకు మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ పరీక్షకు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 40,331 మంది దరఖాస్తు చేసుకోగా.. 30,884 మంది హాజరయ్యారు. అందులో 14,473(46.86%) మంది ఉత్తీర్ణత సాధించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఆయా మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు చేపట్టనున్నారు. విద్యార్థులు తమ మార్కులను http://telangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా మార్కులు, ర్యాంకుల జాబితాను చెక్ చేసుకోవచ్చని అధికారుల సూచించారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కొరకు స్థలాన్ని కేటాయించాలి

- వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు,
- డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్.

**సూర్యాపేట,విశాలభారతి:**

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కొరకు స్థలాన్ని కేటాయించాలని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు స్థలం కేటాయించాలని అన్ని జిల్లాలో కలెక్టర్ లకు మెమోరాండం అందజేయాలని వారు ఆదేశించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 26న జరిగిన రాష్ట్ర క్యాబినెట్లో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు జిల్లా హెడ్ క్వార్టర్స్ వద్ద ఎకరం భూమిని కేటాయించి అటువంటి కార్యాలయాలకు ఆస్తి పన్ను మినహాయింపు నిర్ణయించిందని తెలిపారు. భూమికి చెల్లింపు వంటి అన్ని అధికారిక ఫార్మాలిటీలను నెరవేర్చడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దానిలో భాగంగానే సూర్యాపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా దరఖాస్తు చేశామని కానీ బిఆర్ఎస్ పార్టీకి మాత్రమే స్థలం కేటాయించిందని మిగతా రాజకీయ పార్టీలకు కేటాయించలేదని తెలిపారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో అన్ని జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఎమ్మార్వో కు ఫోన్ ద్వారా తెలియజేసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కోసం స్థలం పరిశీలించమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, మార్కెట్ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, చింతమల్ల రమేష్, ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, రుద్రంగి రవి, నాగుల వాసు, అబ్దుల్ రహీం, సిరివెళ్ల శబరినాథ్, అన్నమయ్య రాము, సాయి నేత తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి తాండవించింది

- బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

**బాల్కొండ,విశాలభారతి:**



పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి తాండవించిందని, అవినీతి బకాసురుడు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ఇప్పుడు ఏమి పాలుపోక కాంగ్రెస్ పార్టీపై తప్పుడు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు.మోర్తాడ్ ప్రజానిలయంలో ఆయన పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగ బాల్కొండ కాంగ్రెస్ పార్టీకి ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ...పచ్చ కామెర్లు సోకిన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు,అవినీతి పరుడైన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి అంత అవినీతే కనిపిస్తోందని అన్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులదని, ప్రతి పథకంలో కమీషన్లకు కక్కృత్తి పడ్డారని,ఆఖరికి సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులను కూడా బీఆర్ఎస్ నాయకులు వదలలేదని అన్నారు.ప్రజా పాలనలో అంతా ప్రజల నిర్ణయం ప్రకారమే నడుస్తుందని తెలిపారు. ప్రజా పాలన గ్రామసభలు ఊరూరా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రజలతో చర్చించి వారి ఆమోదంతోనే ఇల్లు కట్టుకోవాలి అనుకునే వారికి అసలైన లబ్ధిదారులకే ఇండ్లను మంజూరు చేశారని అన్నారు.పథకాలలో లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా ఎంపిక చేస్తుందని అన్నారు.ప్రజా పాలనలో ఎటువంటి అవినీతికి తావులేదని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తప్పుడు ఆరోపణలు మానుకొని చెంపలు వేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి దమ్ముంటే కాంగ్రెస్ నాయకులపై చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు.ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొంటుందని ఈసారి దిగుబడి చాలా ఎక్కువగా ఉందని అధికారులు ఎక్కడ కూడా అలసత్వం ప్రదర్శించడం లేదని,రైతు నుండి ఎంత వీలైతే అంత తొందరగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమవుతున్నాయని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులను కడ్తా పేరుతో నిలువు దోపిడీ చేశారన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి ఈ విషయంలో కనీసం మాట్లాడే అర్హత కూడా లేదని ఆయన తెలిపారు. పరిపాలన అంతా సజావుగా సాగుతుందని అధికారులకు స్వేచ్ఛ ఉందని వారికి నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రజా ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీది నియంత పాలనని,కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన అని అన్నారు.ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఈ రెండింటి మధ్య తేడా తెలుసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**బాల్కొండ,విశాలభారతి:**

16ఏళ్ల విరామం తర్వాత వేల్పూర్ మండలం మోతె గ్రామనికి చెందిన జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఏంరా,ఒరేయ్ అన్న సంబోధనలతో వేదిక వేడుకగా మారింది.200809 విద్యా సంవత్సరం విద్యార్థులు సంఘటితంగా ఏర్పడి అప్పట్లో తమకు విద్యాబోధనలు నేర్పిన గురువులను ఆత్మీయంగా సత్కరించుకోవడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 16ఏళ్ల తర్వాత తమ తోటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.చిన్ననాటి జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. గురువులు నేర్పిన విద్యాబుద్ధులు నేర్చుకొని జీవితంలో స్థిరపడ్డామని, గురువుల స్థానం గొప్పదని విద్యార్థులు గురువులను కొనియాడారు.



## ఓయూ మైక్రో బయాలజీ రజతోత్సవ వేడుకలు

- బ్రోచర్ ను ఆవిష్కరించిన వీసీ

**విశాలభారతి, ఓయూ:**

ఓయూ వీసీ ప్రొ. మొలుగారం కుమార్ అక్టోబర్ లో "ఎమర్జింగ్ మైక్రోబియల్ టెక్నాలజీస్ ఫర్ వన్ హెల్త్ " పై ఓయూలో అంతర్జాతీయ సదస్సు బ్రోచర్స్ విడుదల చేశారు. ఓయూ మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ ను స్థాపించి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలను (సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్) జరుపుకోవడంతోపాటు వచ్చే అక్టోబర్ 15, 16,17 తేదీలలో "ఎమర్జింగ్ మైక్రోబియల్ టెక్నాలజీస్ ఫర్ వన్ హెల్త్ " పై మూడు రోజులపాటు ఓయూలో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు కాన్ఫరెన్స్ కన్వీనర్, ఓయూ మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ బి.బీమా తెలిపారు. సదస్సుకు బ్రోచర్ ను వీసీ ప్రొ. కుమార్ సోమవారం ఓయూ పరిపాలన భవనములో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడం ద్వారా నూతన ఆవిష్కరణలను చేయవచ్చునని పేర్కొన్నారు.ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల నుంచి స్పీకర్స్, ప్రతినిధులు హాజరవుతుండడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సదస్సు ద్వారా రీసెర్చ్ పేపర్స్ ను అంతర్జాతీయ గుర్తింపు పొందిన రీసర్చ్ జర్నల్స్ లో ప్రచురించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఓయూకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభిస్తుందని విసి వివరించారు. అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొ. బి. బీమా మాట్లాడుతూ. ఈ సదస్సు ద్వారా సైంటిస్టులను, ప్రొఫెసర్స్ ను, పరిశోధకులను, మైక్రోబయాలజీ రంగంలో పనిచేస్తున్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ నుఒకే వేదిక వైపు తీసుకొస్తున్నామని వివరించారు. ఈ సెమినార్ కు సంబంధించిన వ్యక్తులు తమ పరిశోధనా పత్రాలను పంపించాలని ఆయన సూచించారు. సదస్సుకు సంబంధించిన పూర్తి వివరాలు ఓయూ వెబ్ సైట్ లో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి నరేష్ రెడ్డి, ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. గుండా ప్రభాకర్, ఓయూ మైక్రో బయాలజీ ఫ్యాకల్టీ మెంబర్స్ ప్రొ. సందీప్త, డాక్టర్ హామీదా బి పాల్గొన్నారు.



## రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామ ప్రొఫైల్ తయారు చేయాలి

- భూభారతి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలి.
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

**సూర్యాపేట, విశాలభారతి:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టం క్రింద రైతులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపిన మీదట క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ పి. రాంబాబుతో కలిసి కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూభారతి దరఖాస్తుల పరిశీలన, విచారణ అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. ముందుగా డస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులు వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలి, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనల కనుగుణంగా విచారణ జరపాలన్నారు. విచారణ జరిపేందుకు వెళ్లే ముందుగా దరఖాస్తుదారునికి నోటీసు అందజేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో గ్రామాల వారిగా గ్రామ ప్రొఫైల్ తయారు చేయాలని తాసిల్దార్లకు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో భూభారతి కార్యక్రమంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద చేపట్టిన గరిడేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులలో మొత్తం 1690 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ముందుగా సిబ్బంది భూభారతిలో దరఖాస్తు చేసిన వారికి నోటీసులు పంపాలని దానిలో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చే తేదీలను కూడా చేర్చాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాలలో భూ పరిశీలనకు వెళ్ళినప్పుడు పోలీసు బందోబస్తుతో దరఖాస్తుల పరిశీలనకు వెళ్లాలని తెలిపారు. అధికారులు దరఖాస్తులను పూర్తి పరిశీలించిన పిమ్మట అన్ని డాక్యుమెంట్లతో పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రజావాణి, జిల్లా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూర్యపేట ఆర్డిఓ వేణుమాధవరావు, కోదాడ సూర్య నారాయణ, హుజూర్నగర్ శ్రీనివాసులు, అన్ని మండలాలకు చెందిన తాసిల్దారులు ,ఆరైలు, డీటీలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిజియోథెరపిస్ట్ గా మారిన యోధుడు

- నాసా హాస్పిటల్ డాక్టర్లు.
- ఇతరులకు వైద్యం చేయడం నుండి తన సొంత జీవితం కోసం పోరాటం వరకు
- మిస్టర్ పగిళ్ల తిరుపతి ప్రయాణం.

**ఎల్బీనగర్ , విశాలభారతి;**



ప్రాణాంతకమైన వైద్య అత్యవసర పరిస్థితిని అధిగమించి విజయం సాధించిన హైదరాబాద్‌లోని హయత్ నగర్‌కు చెందిన 32 ఏళ్ల ఫిజియోథెరపిస్ట్ పగిళ్ల తిరుపతి అద్భుతంగా కోలుకున్న విధానం గురించి తెలుసుకోవడానికి విలేకరులను సమావేశంలో డాక్టర్లు వెల్లడించారు.పునరావాసంలో తన పనికి పేరుగాంచిన అంకితభావంతో కూడిన ఆరోగ్య సంరక్షణ నిపుణుడు తిరుపతి, అరుదైన మరియు క్లిష్టమైన వాస్కులర్ వ్యాధి అయిన ధమని త్రంబోసిస్ కారణంగా తీవ్రమైన కుడి దిగువ అవయవ ఇస్కీమియాకు గురైనప్పుడు ఊహించని విధంగా స్వయంగా రోగి అయ్యాడు. అతని కష్టకాలం నడుము నొప్పి మరియు కుడి కాలులో తిమ్మిరితో ప్రారంభమైంది, ఇది వేగంగా జలదరింపు, సంచలనం కోల్పోవడం మరియు చలనశీలత బలహీనపడటం వంటి వాటికి దారి తీసింది, అత్యవసర ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం ఏర్పడింది.దీని తరువాత ఇంటెన్సివ్ కేర్ మరియు బహుళ ప్రాణాలను రక్షించే శస్త్రచికిత్స జోక్యాలతో కూడిన క్లిష్టమైన కాలం ఏర్పడింది, వీటిలో కుడి మోకాలి క్రింద ఉన్న ఫాసియోటమీ మరియు తొడ మరియు పాప్లిటియల్ ధమనుల యొక్క ధమని ఎంబోలెక్టమీ, పూర్వ టిబియల్ ఆర్టరీ ఎంబోలెక్టమీ మరియు మరమ్మత్తు, గాయం డీబ్రిడ్మెంట్ మరియు డ్రెస్సింగ్ విధానాలు మరియు ప్లాస్టిక్ సర్జన్లు వెన్నెముక అనస్థీషియా కింద అడ్వాన్స్‌నెంట్ ఫ్లాప్ మరియు VAC థెరపీతో స్కిన్ గ్రాఫ్టింగ్ ఉన్నాయి. తిరుపతి పరిస్థితి తీవ్రతను ఆయన కుడి కాలులోని అనేక ధమనులు పూర్తిగా థ్రాంబోసిస్‌కు గురిచేశాయి, వీటిలో ఉపరితల తొడ మరియు పాప్లిటియల్ ధమనులు కూడా ఉన్నాయి, అంతర్గత ఇలియాక్ ధమని యొక్క దృశ్యమానత లేకపోవడం కూడా ఉంది, దీనిని సీటి పరిధీయ యాంజియోగ్రఫీ వెల్లడించింది. ఒక క్లిష్టమైన సమయంలో, ఆయన కుడి కాలులో పల్స్ లేదు, పాదాన్ని కదపలేకపోయాడు, ఇది కదలికపై ఆధారపడిన వృత్తికి చాలా వినాశకరమైన అవకాశం దక్కిందన్నారు. నాసా హాస్పిటల్స్‌లోని మల్టీడిసిప్లినరీ బృందం నిపుణులైన మరియు సమన్వయంతో కూడిన సంరక్షణలో తిరుపతి ఇంటెన్సివ్ మానిటరింగ్ రిససిటేషన్, యాంటీబయాటిక్ ఇన్ఫ్యూషన్లు, రక్త మార్పిడి, ఖచ్చితమైన నొప్పి మరియు గాయాల నిర్వహణ, VAC థెరపీ మరియు అంకితమైన నర్సింగ్ కేర్‌తో కూడిన కఠినమైన వైద్య ప్రయాణాన్ని చేపట్టామన్నారు. ఈ బృందంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ నవీన్, క్రిటికల్ కేర్,అనస్థీషియా అధిపతి డాక్టర్ రాకేష్, వాస్కులర్,ప్లాస్టిక్ సర్జన్లు,ఆర్థోపెడిక్ నిపుణులు పాల్గొన్నారు.

# బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా అరుణ్ కుమార్

**విశాలభారతి,హైదరాబాద్:**

బీసీ చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా వంగ అరుణ్ కుమార్ గౌడ్ ను నియమించినట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాదులో బీసీ సాధికారత సంస్థ భవన్ లో సోమవారం బీసీ చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నియామకాన్ని చేపట్టారు. కాగా నియామకం అనంతరం వంగ అరుణ్ కుమార్ మాట్లాడుతూ..రాష్ట్రంలో బీసీలను చైతన్యం చేసి వారి హక్కుల కోసం ఉద్యమాలు చేపడుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన చెప్పారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, కేంద్రం దీన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యతిరేకమైన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ను తెలంగాణలో రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం 42% రిజర్వేషన్ బిల్లును కేంద్రానికి పంపించామని భావించి చేతులు దులుపుకోవద్దని, అమలు చేసే వరకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని వ్యాఖ్యానించారు.



cinema updates

# కిసిక్ బ్యూటీ కసెక్కించే జోరు



## నాని అలాంటి ప్రయత్నం చేసేదెప్పుడు?



స్వీయా దర్శకత్వంలో సినిమా చేయడం అన్నది అతికొద్ది మందే చేయగలరు. కెరీర్ ఆరంభంలో అడవి శేషు 'కర్మ' సినిమా చేసాడు. అటుపై 'కిస్' చిత్రం కూడా అలా రూపొందించినదే. ఆ రెండు చిత్రాలు మిన హాయిస్తే ఆయన హీరోగా నటించిన చాలా సినిమలకు రైటింగ్ విభాగంలోనూ పనిచేసారు. వాటిని వేర్వేరు దర్శకులు తెరకెక్కించారు. ఆ తర్వాత చాలా కాలానికి విశ్వక్ సేన్ కూడా అలా ఎంట్రీ ఇచ్చిన వాడే. 'ఫలక్ నుమా దాస్' ని స్వీయా దర్శకత్వంలో తెరకెక్కించాడు. ఆ సినిమా యావరేజ్ గా ఆడింది. అటుపై 'దాస్ కా దమ్కీ' చిత్రాన్ని కూడా అలాగే తెరకెక్కించాడు. అలా తమలో దర్శకత్వ అభిరుచుని కూడా బయట పెట్టారు. కానీ నేచురల్ స్టార్ నాని మాత్రం ఇంకా అలాంటి అటెంప్ట్ చేయలేదు. నాని అసిస్టెంట్ డైరెక్టర్ గా కెరీర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. డైరెక్టర్ అవ్వాలనే ఇండస్ట్రీకి వచ్చి బాబు వద్ద శిష్యరికం చేసాడు. కానీ ఇండస్ట్రీ ఆయన్ని హీరోని చేసింది. 'అష్టాచెమ్మా' సక్సెస్ అవ్వడంతో అప్పటి నుంచి హీరోగానే కొనసాగుతున్నాడు. స్టార్ గా ఎదిగిన తర్వాత వాల్ పోస్టర్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి ప్రతిభావం తుల్ని ఎంకరేజ్ చేస్తూ సినిమాలు చేస్తున్నాడు. కానీ తాను మాత్రం ఇంకా కెప్టెన్ కుర్చీ ఎక్కలేదు. భారీ స్టార్ డమ్ కలిగిన స్టార్ గా కొనసాగుతున్నాడు. కోట్లాది రూపాయలు పారితోషికం తీసుకుంటున్నాడు.పాన్ ఇండియా మార్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. మరి డైరెక్టర్ ఎప్పడవుతారు? స్వీయా దర్శ కత్వంలో సినిమా ఎప్పడు ఉంటుంది అంటే? నాని నుంచి కూడా సరైన సమాధానం రాలేదు. ఫాంలో ఉన్నంత కాలం హీరోగా కొనసాగి అటుపై డైరెక్షన్ వైపు మళ్లుతాడేమో చూడాలి.

## పాక్ నటికి షాకిచ్చిన బాలీవుడ్



పహల్గామ్ ఉగ్రదాడి వల్ల దేశంలో ఎన్నో మార్పులొచ్చాయి. ప్రతీ విషయంలో ఆ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే సినీ ఇండస్ట్రీలో మన దేశానికి చెందిన వాళ్లే కాకుండా ఇతర దేశాలకు సంబంధించిన వాళ్లు కూడా వర్క్ చేస్తుంటారనే విషయం తెలిసిందే. అందులో భాగంగానే పాక్ నటీనటులు కూడా ఇండియన్ సినిమాలో కొంతమంది నటిస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి, దాన్ని తిప్పి కొడుతూ ఇండియన్ ప్రభుత్వం చేసిన ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పలువురు పాక్ ఆర్టిస్టులపై ఇండియన్ సినీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నిషేధం విధించింది. ఇప్పుడు తాజాగా బాలీవుడ్ మూవీ సనమ్ తేరీ కసమ్2 నుంచి పాకిస్తాన్ నటి మావ్రా హోకేన్ ను తప్పిస్తున్నట్టు చిత్ర యూనిట్ అనౌన్స్ చేసింది. పాకిస్తాన్ తో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశమే ప్రధానమని చెప్తూ ఆమెను తొలగిస్తూ చిత్ర యూనిట్ ప్రకటించింది. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనైనా నిస్సందేహంగా ఖండిస్తామని కూడా చిత్ర మేకర్స్ ఈ సందర్భంగా తెలిపారు. ఇదిలా ఉంటే ఆ సినిమాలో హీరోగా నటించిన హర్షవర్ధన్ రాణే గతంలోనే ఆమె ఉంటే నటించేది లేదని స్టేట్మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ పై మావ్రా చేసిన వ్యాఖ్యలపై స్పందించిన హర్షవర్ధన్ తన ఇన్స్టాలో ఓ పోస్ట్ పెట్టాడు. ఆ పోస్ట్ లో తన దేశాన్ని ఉద్దేశించి కొందరు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తానొక నిర్ణయానికి వచ్చానని, గతంలో నటించిన వాళ్లే సనమ్ తేరీ కసమ్2 లో కూడా నటిస్తానంటే తాను అందులో నటించాలనుకోవడం లేదని రాసుకొచ్చాడు.

శ్రీలీల బాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ ఛాన్సులందుకుంటుంది. ఒక్క సినిమా రిలీజ్ అవ్వకుండానే మరో రెండు చిత్రాలకు సైన్ చేసిందంటే? అమ్మడు జోరు అక్కడ ఏ రేంజ్ లో కొనసాగుతుందో చెప్పాల్సిన పనిలేదు. ప్రతిష్టాత్మక హిట్ ఫ్రాంచైజీ 'ఆషికీ-3' తో ఎంట్రీ ఇస్తుంది. ఇందులో కార్తీక్ ఆర్యన్ కి జోడీగా నటిస్తోంది. 'ఆషికీ' నుంచి రిలీజ్ అయిన రెండు చిత్రాలు భారీ విజయాలు సాధించడంతో మూడవ భాగంపై భారీ అంచనాలున్నాయి. ఇలాంటి లవ్ స్టోరీతో శ్రీలీల ఎంట్రీ ఇవ్వడంతోనే రిలీజ్ కు ముందే అమ్మడు అక్కడ ఫేమస్ అయిపోతుంది.కార్తీక్ ఆర్యన్ తో రొమాంటిక్ సన్నివేశాల శ్రీలీల చెలరేగడం ఖాయం. అనురాగ్ బసు తెరకెక్కిస్తోన్న చిత్రం దీపావళికి రిలీజ్ అవుతుంది. ఈసినిమా సెట్స్ లో ఉండగానే యంగ్ హీరో సిద్దార్ మల్హోత్రాకి జోడీగానూ ఎంపికైంది. రాజ్ నిందియాలా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఆనంద్ ఎల్. రాయ్ నిర్మాత కావడం మరో విశేషం. శ్రీలీల పెర్ఫార్మెన్స్ నచ్చిందంటే ఆనంద్ ఎల్. రాయ్ తన దర్శక త్వంలోనే ఛాన్స్ ఇవ్వడం ఖాయమే. ఈ రెండు సినిమాల సంగతి పక్కన బెడితే అమ్మడిప్పుడు ఏకంగా బడా బ్యానర్లోకే ఎంటర్ అవుతున్నట్లు సమాచారం. శ్రీలీలపై ధర్మ ప్రొడక్షన్స్ అధినేత కరణ్ జోహార్ కన్నుపడింది. ఆయన హిట్ ఫ్రాంచైజీ 'దోస్తానా 2' లో శ్రీలీలను హీరోయిన్ గా ఎంపిక చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ ఛాన్స్ స్వయంగా కరణ్ జోహార్ తీసుకున్నాడని వినిపిస్తుంది. తొలుత ఆయన కొంత మంది సౌత్ భామల పేర్లను పరిశీలించారుట. ఈ క్రమంలో సౌత్ నుంచి వచ్చి నార్త్ లో సినిమాలు చేస్తోన్న పేర్లను పరిశీలించి శ్రీలీల అయితే బాగుంటుందని ఎంపిక చేసినట్లు వినిపిస్తుంది. ఈ అవకాశం నిజమైతే శ్రీలీల జాతకం మారిపోతుంది. టాలీవుడ్ లో సాధించలేనిది బాలీవుడ్ లో సాధిస్తుంది. అమ్మడి చలాకీతనానికి అక్కడ కనెక్ట్ అవ్వడం సులభమే.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.